# సూర్య

నేటి దినపత్రిక

17వ వసంతంలోకి..

## ఎన్టీఆర్ - కృష్ణా

గురువారం 22 ఆగస్టు 2024 | పేజీలు 8


## జగన్ హయాంలో విద్యావ్యవస్థ నిర్వీర్యం

- బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత

వివరాలు 2లో



ప్రకృతి సేద్యం ఉత్పత్తులతో..

# ఆరోగ్యం పదిలం

- ప్రకృతి వ్యవసాయ విధానాలతో పర్యావరణానికీ ఎంతో మేలు
- జీరో బడ్జెట్ ప్రకృతి వ్యవసాయంలో ఆదర్శంగా నిలుస్తున్న చెవుటూరు రైతులు
- జిల్లా కలెక్టర్ డా. జి.సృజన





**ఎన్టీఆర్ జిల్లా/ జి.కొండూరు, ఆగస్టు 21, మేజర్ న్యూస్ :** ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యంతో పాటు ఈ వ్యవసాయ విధానంతో పర్యావరణానికీ ఎంతో మేలు జరుగుతుందని.. జీరో బడ్జెట్ ప్రకృతి వ్యవసాయంలో చెవుటూరు రైతులు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని జిల్లా కలెక్టర్ డా. జి.సృజన అన్నారు. బుధవారం కలెక్టర్ సృజన జి.కొండూరు మండలం, చెవుటూరు గ్రామంలో పర్యటించారు. తొలుత గ్రామ పరిధిలోని రైతులు అనుసరిస్తున్న జీరో బడ్జెట్ ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పరిశీలించారు. నేలకు బలం.. పంటకు ఆరోగ్యాన్నిచ్చే జీవామృతం తయారీ విధానాన్ని పరిశీలించారు. అదే విధంగా వివిధ రకాల కషాయాల తయారీ, వినియోగించే విధానాల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. కొన్నేళ్లుగా ఈ ప్రాంత రైతులు, కౌలు రైతులు తాము ప్రకృతి సేద్యం ద్వారా పండిస్తున్న పంటలు, దిగుబడి, మార్కెటింగ్ తదితర వివరాలను కలెక్టర్, అధికారులతో పంచుకున్నారు. జీరో బడ్జెట్ ప్రకృతి సాగుతో తాము ఎంతో లాభపడుతున్నామని.. మిగతా 2లో



# ఆంధ్రుల ఆస్తి విశాఖ ఉక్కు

- విశాఖ స్టీల్ ప్లాంట్‌కు పూర్వ వైభవం తీసుకొస్తాం
- కొంచెం తోడ్పాటు అందిస్తే దేశంలోనే టాప్ స్టీల్‌గా నిలుస్తుంది
- ప్లాంటులో పర్యటించి, వివరాలు తెలుసుకున్న మంత్రి కొల్లు రవీంద్ర

**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** పోరాటాలు, ప్రాణ త్యాగాలతో సాధించుకున్న ఆంధ్రుల ఆస్తి విశాఖ ఉక్కు అని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు 2

కేడీసీసీ బ్యాంక్ కంప్యూటరీకరణ ప్రక్రియ

# వేగవంతం చేయాలి

### జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** కేడీసీసీ బ్యాంక్ కంప్యూటరీకరణ ప్రక్రియ వేగవంతం గావించాలని, మెరుగైన సేవలు అందించాలని కేడీసీసీ బ్యాంక్ పర్సన్ ఇంచార్జ్, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ సూచించారు. కేడీసీసీ బ్యాంక్ మహాజనసభ బుధవారం స్థానిక జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాలులో బ్యాంకు పర్సన్ ఇన్చార్జి, జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. తొలుత బ్యాంకు సీఈవో ఏ. శ్యామ్ మనోహర్ 2024 మార్చి 31వ తేదీతో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బ్యాంకు యొక్క ఆస్తి, అప్పుల పట్టిక, లాభనష్టముల ఖాతా, ఆడిట్ రిపోర్టుతో కూడిన వార్షిక నివేదిక సభకు సమర్పించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ వందేళ్ళ చరిత్ర గల కేడీసీసీ బ్యాంకు అనేకసార్లు నాబార్డ్ అవార్డులు అందుకుందన్నారు. బ్యాంకింగ్ సేవలు మరింత విస్తృతం చేయడానికి చేపట్టిన కంప్యూటరీకరణ ప్రక్రియ వేగవంతం గావించాలని, మిగతా 2లో...

# ప్రకృతి సేద్యం ఉత్పత్తులతో ఆరోగ్యం పదిలం



(మొదటిపేజీ తరువాయి)

తోటల్లో, చేల గట్ల మీద వేసే అంతర పంటలతో అదనపు ఆదాయం లభిస్తోందని, తాము ఇళ్లలో ఇవే ఉత్పత్తులను వినియోగిస్తున్నామని తెలిపారు. అసక్తికలిగిన వారికి కూడా ఈ సాగు విధానాలపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. సీతాఫలం, ఉమ్మెత్త, వేప తదితర పది రకాల ఆకులతో తయారుచేసే కషాయం మంచి ఫలితాలు ఇస్తోందని వివరించారు. ప్రకృతి వ్యవసాయ విధానాల ద్వారా 5204 రకం వరి సాగు ద్వారా మంచి రాబడి వస్తోందని ఓ రైతు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ డా. జి.సృజన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో మన రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు ఉందని.. జిల్లాలో పెద్ద ఎత్తున ఈ విధానాలను అమలుచేసేలా రైతులను ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. ఎలాంటి రసాయన ఎరువులు, పురుగుమందులు వాడకుండా జీవామృతం, వివిధ కషాయాలను ఉపయోగించి చేసే సాగుతో వచ్చే ఉత్పత్తులు ఆరోగ్యానికి ఎంతోమేలు చేస్తాయన్నారు. గత నాలుగైదేళ్లుగా చెవుటూరు రైతులు జీరో బడ్జెట్ ప్రకృతి సేద్యం చేస్తూ, దాంతో ప్రయోజనాలు పొందు





తున్నారని, నలుగురికీ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. వాణిజ్య పరంగా ఈ విధానం గిట్టుబాటు కాదు అనే అపోహలను వీరు దూరం చేశారన్నారు. ప్రకృతి సేద్యం ఉత్పత్తులను పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, వసతిగృహాల్లో వినియోగించేలా ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. అదే విధంగా పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో అందుబాటులో ఉన్న స్థలాల్లో ప్రకృతి సేద్యంతో కిచెన్ గార్డెన్లను అభివృద్ధి చేసేలా చొరవ తీసుకుంటున్నట్లు వివరించారు. విద్యార్థులకూ ఈ విధానాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సేద్యానికి అవసరమయ్యే కషాయాలు వంటివి తయారుచేసుకోలేని వారికి వీలుగా డీఆర్‌డీఏ, ఔత్సాహిక రైతుల ద్వారా దుకాణాల ద్వారా విక్రయానికి పైలట్ ప్రాజెక్టును చేపట్టనున్నట్లు కలెక్టర్ సృజన వివరించారు.

**అంగన్వాడీ, పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్**

కలెక్టర్ సృజన.. చెవుటూరులోని అంగన్వాడీ ప్రీ ప్రైమరీ, మండల పరిషత్



ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. పాఠ్య, సహపాఠ్య కార్యక్రమాల అమలుతీరును పరిశీలించారు. చిన్నారులకు మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా వడ్డించారు. ఆహార నాణ్యతను పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రంలో కిచెన్ గార్డెన్‌ను పరిశీలించి.. ట్రేలో విత్తనాలు చల్లారు. ఈ సందర్భంగా కలెక్టర్ సృజన మాట్లాడుతూ విద్యార్థుల సమగ్రాభివృద్ధికి టీచింగ్ ప్లాన్ ప్రకారం బోధన జరిగేలా చూడాలన్నారు. అదే విధంగా కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్ పెంచేలా ప్రత్యేక కార్యక్రమాలు అమలుచేయాలని ఆదేశించారు. బడిబయట పిల్లలు ఉండకుండా ప్రత్యేకంగా సర్వే నిర్వహిస్తున్నామని.. 100 శాతం పాఠశాలల్లో నమోదు జరిగేలా చూస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్లు వివరించారు. కలెక్టర్ వెంట డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, మండల ప్రత్యేక అధికారి జి.మోహన్‌బాబు, ఎంపీడీవో పి.అనురాధ, తహసీల్దార్ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.







# జగన్ హయాంలో విద్యావ్యవస్థ నిర్వీర్యం





## బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్ సవిత

**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** కృష్ణా జిల్లా మోపిదేవి మండల కేంద్రంలో ఉన్న ఎంజేపీ ఏపీ బీసీ వెల్ఫేర్ బాలుర రెసిడెన్షియల్ స్కూల్లో రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్ సవిత ఆకస్మిక తనిఖీలు చేశారు. హాస్టల్ లో ప్రతి గదిని క్షుణ్ణంగా పరిశీలించారు. రిజిస్టర్ల తనిఖీ చేశారు. మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండటంపై మంత్రి సంతృప్తి వ్యక్తపరిచారు. జగన్ హయాంలో అన్ని వ్యవస్థలతో పాటు విద్యావ్యవస్థ నిర్వీర్యమైందని మంత్రి అన్నారు. విధ్వంసం నుంచి అభివృద్ధి వైపు రాష్ట్రాన్ని పరుగులు పెట్టిస్తున్న సీఎం చంద్రబాబు, చంద్రబాబు నాయకత్వంలోని మా ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు.

# ఆంధ్రుల ఆస్తి విశాఖ ఉక్కు

(మొదటిపేజీ తరువాయి)



రవీంద్ర అన్నారు. విశాఖ పటర్యటనలో భాగంగా స్టీల్ ప్లాంటును పరిశీలించారు. పరిశ్రమ నిర్వహణ, బ్లాస్ట్ ఫర్నేస్‌ను అధికారులో కలిసి పరిశీలించారు. వందలాది మంది ప్రాణ త్యాగాలతో నాడు విశాఖ ఉక్కును ఏర్పాటు చేసుకున్నామని, దాన్ని పరిరక్షించుకునేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గత ప్రభుత్వ హయంలో ప్లాంటు భూముల్ని ఆక్రమించేందుకు కుట్రలు చేశారన్నారు. అదే సమయంలో స్టీల్ ప్లాంటును తొలగించి, ఆ ప్రాంతంలో రాజధాని నిర్మాణం చేయాలని జగన్ రెడ్డి ప్రయత్నించినట్లు నాటి సీఎస్ బయట పెట్టడం ఆశ్చర్యం కలిగించిందన్నారు. ఉక్కు ఆస్తుల్ని కబ్జా చేసేందుకు జగన్ రెడ్డి కుట్రలు చేయడం సిగ్గుచేటు అన్నారు. కొంచెం తోడ్పాటు అందిస్తే దేశానికే ఆదర్శంగా నిలిచే సత్తా విశాఖ ఉక్కుకు ఉందన్నారు. విశాఖ ఉక్కును కాపాడుకుని తీరుతామని మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు గండి బాబ్జీ, గాజువాక ఎమ్మెల్యేపల్లా శ్రీనివాస్, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు తదిరులు పాల్గొన్నారు.

# కేడీసీసీ బ్యాంక్ కంప్యూటరీకరణ ప్రక్రియ వేగవంతం చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

ఈ ప్రక్రియ భారంగా అనుకోకుండా ఒక యజ్ఞం లాగా భావించి బ్యాంకు సిబ్బంది, సహకార సంఘాల సిబ్బంది సమన్వయంతో కంప్యూటరీకరణ గడువులోగా పూర్తి చేయాలని అన్నారు. తద్వారా బ్యాంకింగ్ సేవలు మరింత సులువుగా, సరళతరం కాగలవని అన్నారు. ఇప్పటికే అప్డేట్ తో కూడిన హార్డ్వేర్ అందించడం జరిగిందన్నారు. ఈ ప్రక్రియను మిషన్ మోడ్లో చేపట్టాలన్నారు. మొబైల్ యాప్ ద్వారా ఆన్లైన్ బ్యాంకింగ్ సేవలు ఇప్పటికే అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లా సహకార శాఖ అధికారి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ బ్యాంకింగ్ రంగంలో ఇదొక గొప్ప సంస్కరణ గత ఫిబ్రవరి నుండి చేపట్టిన కంప్యూటరీకరణ ప్రక్రియ అక్టోబర్ 2 నాటికి పూర్తి చేయాలన్నారు. బ్యాంకు సేవలు కోర్ బ్యాంకింగ్ స్థాయికి తీసుకురావాలని





లక్ష్యం అన్నారు. 2024 మార్చి 31 నాటికి సభ్యత్వం, వాటాధనము(షేర్ క్యాపిటల్) 393.70 కోట్లతో 11.96 శాతం వృద్ధి, బ్యాంకు డిపాజిట్లు 3094.40 కోట్లతో 1.31 శాతం వృద్ధి, బ్యాంకు లోన్స్ అండ్ అడ్వాన్ సెస్ క్రింద 16.52 శాతం వృద్ధి సాధించినట్లు, రికవరీ 89.25 శాతం సాధించినట్లు వార్షిక నివేదికలో పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాలకు గరిష్టంగా ఒక్కో సంఘానికి 20 లక్షల వరకు రుణాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. షేర్ ధనంపై 6 శాతం డివిడెంట్ ప్రకటించినట్లు తెలిపారు. జిల్లాలో 100 శాతం రుణాలు వసూలు చేసిన 65 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ప్రతినిధులకు సమావేశంలో జ్ఞాపికలు అందజేశారు. సిబ్బందికి ఇన్సెంటివ్ ప్రకటించారు. ఈ సమావేశంలో ఎన్టీఆర్ జిల్లా డీసివో శ్రీనివాసరెడ్డి, డివిజనల్ కోఆపరేటివ్ అధికారి వివి ఫణి కుమార్, బ్యాంకు జిఎం చంద్రశేఖర్, డిజిఎం ప్రభాకర్, పిఎసిఎస్, బ్యాంకు బ్రాంచీల అధికారులు పాల్గొన్నారు.

# ప్రకృతి వైపరీత్యాలపై ఎన్డీఆర్ఎఫ్ బృందం అవగాహన కార్యక్రమాలు






**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాలపై (జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం) ఎన్డీఆర్ఎఫ్ బృందం, స్థానిక అగ్నిమాపక శాఖ సిబ్బంది సంయుక్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం ఉదయం మంగినపూడి బీచ్ రోడ్ లోని ఎస్.వి.హెచ్ ఇంజనీరింగ్ కళాశాలలో 10వ బెటాలియన్, విజయవాడ టీమ్ కమాండెంట్ వీవీఎన్ ప్రసన్న కుమార్ నేతృత్వంలో ఎన్డీఆర్ఎఫ్ బృందం ప్రకృతి వైపరీత్యాల నుండి రక్షణ చర్యలపై మాక్ డ్రిల్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనుకోని ప్రమాదాలు, వరదలు, పిడుగులు, భూకంపాలు, తుపాన్లు వంటి ప్రకృతి వైపరీత్యాల సమయంలో చేయవలసినవి, చేయకూడనివి ఎన్డీఆర్ఎఫ్, అగ్నిమాపక దళం ప్రదర్శించారు. విపత్కర పరిస్థితుల్లో ప్రజలు పాటించవలసిన పద్ధతులు, ప్రథమ చికిత్స, సీపీఆర్ (కార్డియో పల్మనరీ రిససిటేషన్), అగ్ని ప్రమాదాలు, ప్రాణ ఆస్తి నివారణ చర్యలపై గణేష్ రెడ్డి, షేక్ బాషా ఆచరణాత్మకంగా అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో ఎన్డీఆర్ఎఫ్ ఇన్స్పెక్టర్ పింటు నంది, అగ్నిమాపక శాఖ ఎస్ఐ జకరియా, తహసిల్దార్ మధుసూదనరావు, కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## డ్రైనేజీల్లో వ్యర్థాలు వేయరాదు

**మొవ్వ( ఆగస్టు 21) మేజర్ న్యూస్:** డ్రైనేజీల్లో వ్యర్థ పదార్థాలు వేయరాదని మొవ్వ గ్రామపంచాయతీ కార్యదర్శి కె. వి. సోమేశ్వరరావు గ్రామ ప్రజలకు సూచించారు. బుధవారం గ్రామ సర్పంచ్ తూము. పూర్ణచంద్రరావు ఆదేశాల మేరకు అంబేద్కర్ నగర్, వైయస్ జగన్ అన్న కాలనీ ప్రధాన రహదారి వెంబడి గల డ్రైనేజీ పూడిక తీత పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డ్రైనేజీల్లో వ్యర్థ పదార్థాలు వేయరాదని, వ్యర్థ పదార్థాలు వేయడం వలన డ్రైనేజీలు పూడికపోవటంతో పాటు దోమలు, ప్రజారోగ్యానికి హాని కలిగించే క్రిమి కీటకాలు చేరి గ్రామస్తులు అనారోగ్యం పాలయ్యే ప్రమాదం ఉందని వివరించారు. అలాగే గ్రామంలో రహదారులు వెంట చెత్తాచెదారం వేయరాదని ప్రతిరోజు చెత్త బండి తమ నివాస ప్రాంతాలకు వస్తుందని చెత్త బండి లోనే వ్యర్థ పదార్థాలు వేయాలని తెలిపారు. అంతర్గత రహదారులు ప్రక్కన చెత్తాచెదారం, వ్యర్థ పదార్థాలు వేస్తే జరిమానా విధించడం జరుగుతుందని హెచ్చరించారు. గ్రామ ప్రజలు సహకరించి గ్రామాభివృద్ధికి తోడ్పాటు ఇవ్వాలని కార్యదర్శి సోమేశ్వరరావు పిలుపునిచ్చారు.

## ఐదుగురు జూదరులు అరెస్ట్



**మొవ్వ (ఆగస్టు 21) మేజర్ న్యూస్:** జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పామర్రు సీఐ సహకారంతో బుధవారం మండల పరిధిలోని పాలింకెపాడు గ్రామ శివారులో కూచిపూడి ఎస్ ఐ ఎం. సుబ్రహ్మణ్యం తన సిబ్బందితో మెరుపు దాడి చేసి ఐదుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 17,200 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. మండలంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని చట్ట పరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. కోడిపందాలు, చిత్తులాట, పేకాట, నెంబర్ పందాలు, గుండాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై నిఘా ఉంచడం జరిగిందని తెలిపారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల సమాచారం కూచిపూడి పోలీసు వారికి తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వ్యక్తుల పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. అలాగే వాహనాలు కొనుగోలు చేసే వారు వాహనానికి సంబంధించిన పత్రాలను సరిచూచుకోవాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని ఎస్ ఐ సుబ్రమణ్యం తెలిపారు.

# ఐక్యూ జెడ్9ఎస్ ప్రో 5జీ, ఐక్యూ జెడ్9ఎస్ 5జీ ఫీచర్లతో జెడ్9ఎస్ సిరీస్ ప్రారంభం



**విజయవాడ, ఆగస్టు 21, మేజర్ న్యూస్ :** హై పెర్ఫార్మెన్స్ స్మార్ట్ ఫోన్ బ్రాండ్ ఐక్యూ తన ఫుల్ లోడెడ్ ఐక్యూ జెడ్ 9ఎస్ సిరీస్ లో ఐక్యూ జెడ్ 9ఎస్ ప్రో 5జీ, ఐక్యూ జెడ్ 9ఎస్ 5జీలను విడుదల చేయడం ద్వారా మరోసారి ఇండస్ట్రీ బెంచ్ మార్క్ లను సెట్ చేసింది. ఐక్యూ జెడ్9ఎస్ సిరీస్ 'ఫుల్లీ లోడ్ ఫర్ ది మెగాటాస్కర్స్'- ప్రధానంగా కళాశాల విద్యార్థులు, యువ నిపుణులకు వేగవంతమైన కనెక్టివిటీ, అంతరాయం లేని వినోదం అవసరం. ఐక్యూ జెడ్ 9ఎస్ సిరీస్ వారిని సులభంగా మల్టీటాస్క్ చేయడానికి శక్తివంతం చేస్తుంది. వారి బిజీ షెడ్యూల్లను సమర్థవంతంగా నిర్వహించడానికి, రోజంతా కనెక్ట్ అవ్వడానికి సహాయపడుతుంది. ఐక్యూ జెడ్9స్ ప్రో 5జీ స్నాప్డ్రాగన్ 7 జెన్ 3 ప్రాసెసర్ తో పనిచేస్తుంది. ఇది ఆకట్టుకునే 8 ఎల్ ం అన్టూ స్కోర్ తో సెగ్మెంట్ యొక్క వేగవంతమైన కర్వ్ స్మార్ట్ ఫోన్ నిలిచింది. ఐక్యూ జెడ్9ఎస్ 5జీ మీడియాటెక్ డైమెన్సిటీ 7300తో పనిచేస్తుంది,. ఇది 7ఎల్ ప్లస్ ఏన్ టీయూటీయూ స్కోరును సాధిస్తుంది. ఆప్టికల్ ఇమేజ్ స్టెబిలైజేషన్ (ఓఐఎస్)తో కూడిన 50 మెగాపిక్సెల్ సోనీ ఐఎంఎక్స్882 సెన్సార్, ఐక్యూ జెడ్9ఎస్ ప్రో 5జీలో అదనంగా 8 మెగాపిక్సెల్ అల్ట్రా-వైడ్ లెన్స్ ఉన్నాయి. ఐక్యూ జెడ్ 9ఎస్ సిరీస్ లోని రెండు డివైజ్ లు స్లీక్ 7.49 ఎంఎం బాడీని కలిగి ఉన్నాయి. ఇవి తమ సెగ్మెంట్ లో స్లిమ్ కర్వ్ స్మార్ట్ ఫోన్ లుగా నిలిచాయి. స్లిమ్ డిజైన్ ఉన్నప్పటికీ ఇవి 5500 ఎంఏహెచ్ భారీ బ్యాటరీని ప్యాక్ చేస్తాయి, అద్భుతమైన 3డి కర్వ్ అమో ఎల్ ఇడి డిస్ప్లేను కలిగి ఉంటాయి. ఐక్యూ జెడ్9 ఎస్ సిరీస్ లో ఐక్యూ జెడ్9ఎస్ ప్రో 5జీలో 4500 నిట్స్ లోకల్ పీక్ బ్రైట్ నెస్, ఐక్యూ జెడ్9ఎస్ 5జీలో 1800 నిట్స్ లోకల్ పీక్ బ్రైట్ నెస్ ఉన్నాయి. డస్ట్ అండ్ వాటర్ రెసిస్టెన్స్ కోసం ఐపీ64 రేటింగ్ ఉన్న ఈ రెండు ఫోన్లు ఆండ్రాయిడ్ 14 ఆధారిత ఫన్ టచ్ ఓఎస్ 14 ఆపరేటింగ్ సిస్టంపై పనిచేస్తాయి. ఐక్యూ జెడ్ 9ఎస్ ప్రో ధర 8 జీబీ ప్లస్ 128 జీబీ కోసం రూ. 24,999 (సమర్థవంతమైన ధర - రూ.21,999), 8జీబీ ప్లస్ 256జీబీకి రూ.26,999 (సమర్థవంతమైన ధర - రూ. 23,999), 12 జీబీప్లస్ 256 జీబీకి రూ. 28,999 (సమర్థవంతమైన ధర - రూ. 25,999) లక్స్ మార్బుల్, ఆరెంజ్ అనే రెండు ఆకర్షణీయమైన కలర్ వేరియంట్లలో ఆగస్టు 23వ తేదీ మధ్యాహ్నం 12 గంటల నుంచి లభ్యం కానుంది. ఐక్యూజెడ్9 ఎస్ 5ప్లస్ , 8ప్లస్ జీబీ128జీబీ కోసం రూ. 19,999 (సమర్థవంతమైన ధర - రూ. 17,999) ధరబీ 8ప్లస్‌జీబీ256జీబీకి రూ. 21,999 (సమర్థవంతమైన ధర - రూ. 19,999), 12+జీబీ256జీబీకి రూ. 23,999 (సమర్థవంతమైన ధర - రూ. 21,999), ఓనిక్స్ గ్రీన్, టైటానియం మ్యాట్ కలర్ వేరియంట్లలో ఆగస్టు 29వ తేదీ మధ్యాహ్నం 12 గంటల నుంచి అమ్మకానికి రానుంది..

## ఉత్సవ్ ఫిక్స్డ్ డిపాజిట్పై మెరుగైన వడ్డీ రేట్లను ప్రకటించిన ఐడిబిఐ బ్యాంక్

**విజయవాడ మేజర్ న్యూస్ :** ఐడిబిఐ బ్యాంక్ పరిమిత కాలానికి మదుపు చేసే ఉత్సవ్ ఫిక్స్డ్ డిపాజిట్ స్కీమ్ మెరుగైన వడ్డీ రేట్లను ప్రకటించింది. బ్యాంక్ 444 రోజులు, 375 రోజుల ప్రత్యేక పదవీకాలాలపై వడ్డీ రేట్లను పెంచింది. ఇప్పుడు గరిష్ట వడ్డీ రేటు 7.85%, ఏడాదికి 7.75% అందిస్తోంది. ఈ మెరుగుదల అధిక రాబడి కోరుకునే వినియోగదారులకు ఉత్సవ్ ఫిక్స్డ్ డిపాజిట్ని మరింత ఉత్తమ ఎంపికగా చేస్తుంది.

## అనారోగ్యం వ్యక్తికి సీఎం సహాయ నిధి చెక్ అందచేత



**వత్సవాయి ఆగస్టు 21 మేజర్ న్యూస్ :** మండలంలో పోలంపల్లి గ్రామానికి చెందిన తుంగ నాగేశ్వరరావు కుమారుడు తుంగా మహేష్ గత కొంతకాలంగా లంగ్స్ ప్రాబ్లంతో తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. చికిత్స చేయించుకోవడానికి ఆర్థిక పరిస్థితి బాగోలేక బాధపడుతూ ఉంటే ఆ గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) దృష్టికి తీసుకురాగా తక్షణమే స్పందించి పోలంపల్లి గ్రామంలో బాధితుడు తుంగా మహేష్ గృహానికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లి వైద్యానికి సరిపడినంత (4 లక్షల 12 వేల రూపాయలను) ఆర్థిక సహాయాన్ని ఎల్ ఓ సి పత్రాన్ని తీసుకువచ్చి మహేష్ కుటుంబ సభ్యులకు స్థానిక నేతలతో కలిసి తాతయ్య అందజేశారు. ఈ సందర్భంగా తాతయ్య మాట్లాడుతూ ఆపత్కాలంలో నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించడంలో తెలుగుదేశం ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎప్పుడూ ముందుంటుందని అన్నారు. ఇటువంటి సమయంలో వైద్యం అందించడంలో సీఎంఆర్ ఎల్ఓసి అండగా నిలుస్తుందని అన్నారు. ఈ సందర్భంగా మహేష్ కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)లకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ తెలుగు దేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ, వర్గీకరణపై పునరాలోచన చేయాలి



**పెడన, మేజర్ న్యూస్ :** ఎస్. సి ,ఎస్. టి ,వర్గీకరణ పై సుప్రీం కోర్ట్ తీర్పు వ్యతిరేకిస్తూ న్యాయపోరాటం కొరకు ఈరోజు భారత బందులో భాగంగా పెడన పట్టణంలో పెడన మున్సిపల్ సీనియర్ కౌన్సిలర్ గరికిముక్కు చంద్రబాబు ఆధ్వర్యంలో పెడన పట్టణంలో శాంతియుత నిరసన మరియు ప్రభుత్వ ప్రైవేటు కళాశాలలు, స్కూల్,పండ్ల, పూల ,మత్స్య , మాంసాది దుకాణాలు వివిధ వర్తక వాణిజ్య వ్యాపార సంస్థలను శాంతియుతంగా మూయించటం జరిగింది. ఈ సందర్భంగా మొదట పెడన మున్సిపల్ ఆఫీసు వద్ద గల డా బీ ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు అర్పించి ఎస్సీ ఎస్టీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన చేయటం జరిగింది. ఈ సంధర్బంగా మాట్లాడుతూ ఆర్టికల్ 341 ప్రకారం రాజ్యాంగ సవరణ జరగకుండా కులాల మధ్య విభజన చేయటం రాజ్యాంగ విరుద్ధం అని దీని వలన కులాల మధ్య విభేదాలు అనేక నష్టాలకు మరియు అన్నదమ్ముల మధ్య గొడవలు సృష్టించడమే అని ఈప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయ లబ్ది విడిచి ఎస్సీ ఎస్టీ వర్గీకరణ నిలిపివేయాలని కొరటం జరిగింది .ఈ కార్యక్రమంలో అంబేద్కర్ గారి అభిమానులు పెడన పట్టణ మాల కుల యువకులు జన్నబత్తుల వెంకట కృష్ణ , కోడూరు వాసు, బొడ్డు రవి, చుక్కా నరేష్కి ముక్కు మోహనరావు, జల్దుల ఆంజనేయులు, జల్దుల నంచారయ్య, మద్దాల రవి, బొడ్డు రమేష్, చాబత్తుల శ్రీను, పాలపర్తి ఫణీంద్ర, రాగి సురేష్, గరికుముక్కు సత్యనారాయణ , జల్దుల రాహుల్, జంగం రాహుల్, దాసి పండు, బుర్ర నాని,ఊసల సాయి కుమార్, జల్దుల నవీన్, బొడ్డు కిరణ్,బొడ్డు నవీన్, చుక్కా వాసు,గండిపూడి చందు ,గొడవర్తి సాయి, వల్లపు వినయ్, గరికీముక్కు అంబేద్కర్ , గరికిముక్కు చంద్రశేఖర్, మెండు శ్యామ్ కుమార్, బొడ్డు శ్రీను,బొడ్డు సందీప్, దాసి మహేష్,బొడ్డు కన్న, మెండు నాని, చిన్నం రాహుల్, చిన్నం వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

# భీమ్ ఆర్మీ ఆధ్వర్యంలో భారత్ బంద్ విజయవంతం








**కృత్తివెన్ను ఆగస్టు 21 మేజర్ న్యూస్:** దేశంలో ఎస్సీల వర్గీకరణకు సుప్రీంకోర్టు ధర్మాసనం అనుకూలంగా తీర్పునివ్వడంతో ఈరోజు దేశమంతటా దళితులు ధర్మాసనం ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ భారత్ బంద్ కు పిలుపునిచ్చిన విషయం విదితమే. బుదవారం భారత్ బంద్ లో భాగంగా కృత్తివెన్ను మండలంలో గల జై భీమ్ ఆర్గనైజేషన్ వారి ఆధ్వర్యంలో వివిధ అంబేద్కర్ యువజన సంఘాలు, అన్ని గ్రామాల దళిత నాయకులు ఎస్సీ ఎస్టీ ఉపకులాల వర్గీకరణకు వ్యతిరేకంగా " ఎస్సీ వర్గీకరణ వద్దు- ఐక్యతే ముద్దు " అంటూ నినాదాలు చేస్తూ నూటికి నూరు శాతం భారత్ బంద్ ను ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించటం జరిగింది. మండల పరిసర ప్రాంతాలలో గల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, వర్తక వ్యాపార సంస్థలు, ప్రైవేటు రంగ సంస్థలు బంద్ కు సహకరించినందులకు దళిత సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేసి వారికి ధన్యవాదాలు తెలిపారు. ఎస్సీ వర్గీకరణతో పాటు క్రిమిలేయర్ విధానం తమదళితుల మనుగడకు,, భవిష్యత్తు తరాలకు గొడ్డలి పెట్టు అని, సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పు తమ హక్కులను నిర్వీర్యం చేసేలా ఉందని.. తీర్పుపై మరోసారి పునః పరిశీలన చేసి రాజ్యాంగం ద్వారా తమకు లభించిన హక్కులను కాపాడాల్సిందిగా దళిత సంఘాల నాయకులు నినదించారు. జై భీమ్ ఆర్మీ ఆర్గనైజేషన్ కృత్తివెన్ను వారి ఆధ్వర్యంలో మునిపెడ దళితవాడ గ్రామం మొదలుకొని ఎండపల్లి, అడ్డపర్ర, కృత్తివెన్ను, సీతనపల్లి, కోమాళ్ళపూడి, సంగ మూడి, గుడిదిబ్బ, గరిశ పూడి, మాట్లం, చిన్న చందాల, పెద్ద చందాల,తదితర గ్రామాలలోని దళితులంతా బంద్ నిర్వహణలో ముందుకు రాగా, చిన్న గొల్లపాలెం, నిడమర్రు, పడతడిక, తాడి వెన్ను, లక్ష్మీపురం తదితర గ్రామాల నుంచి వచ్చిన దళిత నాయకులు,, దళిత యువకులు వీరికి జత కలవడం జరిగినది. మండలంలో నూటికి నూరు శాతం బంద్ ప్రశాంత వాతావరణంలో నిర్వహించబడినదని,, విజయవంతంగా బంద్ కొనసాగిందని, జై భీమ్ ఆర్మీ అధ్యక్షులు కాలా బత్తుల హేమాచలం, గౌరవ అధ్యక్షులు సాదే రాజు, ఉపాధ్యక్షులు ఈదా కిషోర్ వంటి తదితర ప్రముఖులు తెలియజేశారు. బంద్ కు సహకరించిన ప్రతి ఒక్కరికి, ఎటువంటి అపశృతులు జరగకుండా ప్రశాంత వాతావరణంలో బంద్ నిర్వహణకు తమ వంతు కృషి చేసిన దళితులందరికీ జై భీమ్ ఆర్మీ ఆర్గనైజేషన్ వారు కృతజ్ఞతలు తెలుపుకున్నారు.



## పట్టణ పరిధిలో స్థలాలు, లే అవుట్స్ కొనుగోలు చట్ట విరుద్ధం

**జగ్గయ్యపేట ఆగస్టు 21 మేజర్ న్యూస్ :** ప్రభుత్వము వారి, డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్, ఆంధ్రప్రదేశ్ వారి ది.18.08.2024వ తేది నాటి ఆదేశాల ప్రకారము జగ్గయ్యపేట పట్టణ పరిధిలో అనధికారికంగా ఏర్పాటు చేయబడిన లే అవుట్లలో స్థలము లేక ప్లాట్లు కొనుగోలు చేయుట చట్ట విరుద్దము, ఈ ప్లాట్లకు ప్రభుత్వ నిబంధనల మేరకు రిజిస్ట్రేషన్లు నిలుపుదల చేయుటకు చర్యలు తీసుకొనబడును, ఎటువంటి భవన నిర్మాణ అనుమతులు మంజూరు చేయబడవు మౌలిక వసతులు అనగా రోడ్లు, కరెంటు, నీరు, డ్రైనేజ్ సదుపాయాలు కౌన్సిల్ వారి అనుమతుల మేరకు నిలుపుదల చేయబడును. అనధికారికంగా లే-అవుట్లు ఏర్పాటు చేసిన స్థల యజమానులకు/డెవలపర్లకు నోటీసులు జారీ చేసి చట్టపరమైన చర్యలు తీసుకొనబడును. అనధికారిక లే-అవుట్లలో ఏర్పాటు చేసిన బౌండరీలు, అనధికారికంగా అనుమతులు లేకుండా వేసిన లే-అవుట్లను తొలగించవలసినదిగా పట్టణ ప్రణాళికా అధికారులను ఆదేశించడమైనది. ప్రభుత్వము వారి ఆదేశముల ప్రకారం అనధికారిక లే-అవుట్లను నోటిఫికేషన్ ద్వారా ప్రకటన చేయబడునని తెలియపరచడమైనది ప్లాట్ కొనుగోలుదారులు తప్పనిసరిగా అప్రూవ్ లేఅవుట్ అయినది లేనిది విచారించి కొనుగోలు చేసుకొనవాల్సినదిగా విజ్ఞప్తి చేయడమైనదని పురపాలక సంఘ కమిషనర్ తెలిపారు.

## ఎమ్మెల్యే సౌమ్యని ఎంపీ శివనాథ్ పరామర్శ



**నందిగామ, ఆగస్టు 21, మేజర్ న్యూస్:** విజయవాడలో గత కొంతకాలంగా స్వల్ప అనారోగ్యంతో బాధపడుతున్న శాసనసభ్యులు తంగిరాల సౌమ్యని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) బుధవారం కలిసి పరామర్శించారు. ప్రస్తుత ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

### చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా

## అనారోగ్యం పిల్లలకు డ్రై ఫ్రూట్స్ పంపిణీ



**జగ్గయ్యపేట ఆగస్టు 21 మేజర్ న్యూస్ :** పద్మ విభూషన్ డా. మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వారోత్సవాలులో సందర్భంగా చిరంజీవి యువత జగ్గయ్యపేట నియోజకవర్గ అధ్యక్షులు వల్లపునేని గోవింద్ అధ్వర్యంలో దీర్ఘకాలిక అనారోగ్య పిల్లలకు డ్రై ఫ్రూట్స్ పంపిణీ, అన్నదాన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రముఖ లాయర్ పసుపులేటి సత్య శ్రీనివాస్, మునిసిపల్ కౌన్సిలర్ నూకల సాంబ, మాజీ మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు చౌడవరపు జగదీష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో భాగంగా చౌడవరపు జగదీష్ శ్రేయస్సు ప్రాజెక్ట్ వారి లేప్రా సొసైటీ లోని దీర్ఘ కాలిక అనారోగ్యం తో బాధపడుతున్న పిల్లలకు 10,000/-రూ వారికి డొనేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమం సక్సెస్ చేసిన ప్రతి ఒక్కరికి పేరు పేరున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో ఉమ్మడి కృష్ణా జిల్లా సంయుక్త కార్యదర్శి ఈమని కిషోర్ కుమార్,రాష్ట్ర చిరంజీవి యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ మోసిన్ అహ్మద్, జగ్గయ్యపేట టౌన్ అధ్యక్షులు జక్కంపూడి మల్లికార్జున్,జగ్గయ్యపేట నియోజకవర్గ ఉపాధ్యక్షులు సూరం సుధీర్,టౌన్ ఉపాధ్యక్షులు వేముల నరసింహరాజు,పట్టణ సంయుక్త కార్యదర్శి హరి వంశీ,జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ అరవింద్ కుమార్, జనసేన నాయకులు వెంకటాద్రి(బబ్లూ),పెండ్యాల శ్యామ్,సుభాకర్,హరీష్,పసుపులేటి గోపి,గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

## బీఎస్పీ పట్టణ అధ్యక్షురాలిగా దాములూరి అమృత



**జగ్గయ్యపేట ఆగస్టు 21 మేజర్ న్యూస్ :** నియోజకవర్గంలో చిల్లకల్లు గ్రామానికి చెందిన మహిళా నాయకురాలు దాములూరి అమృత మంగళవారం విజయవాడలో జరిగిన ఒక కార్యక్రమంలో బహుజన సమాజ్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రాష్ట్ర కోఆర్డినేటర్ జే పూర్ణచంద్రరావు,రాష్ట్ర అధ్యక్షులు బక్క పరం జ్యోతి పార్టీ కండువా కప్పి ఆమెను పార్టీలోకి సాదారంగా ఆహ్వానించారు. తదనంతరం ఆమెను జగ్గయ్యపేట నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలిగా నియోజకవర్గ ఇన్చార్జ్, రాష్ట్ర కార్యదర్శి కొదమల ప్రభుదాస్ నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీ నియమ నిబంధనలకు అనుగుణంగా పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయవలసిందిగా నాయకులు ఆమెను కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధానకార్యదర్శి బచ్చులకూర పుష్పరాజు,రాష్ట్ర బిసి నాయకులు పూర్ణ చంద్ర రావు, నియోజకవర్గ అధ్యక్షులు కే వి రత్నం ఆమెకు అభినందనలు తెలిపారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం

### గన్నవరం నియోజకర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు.



**గన్నవరం, ఆగస్టు 21, మేజర్ న్యూస్ :** ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు వరం లాంటిదని గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. గన్నవరం నియోజకర్గం కేసరపల్లి గ్రామానికి చెందిన ఉమ్మనేని పార్వతి అనే మహిళా క్యాన్సర్‌తో బాధపడుతూ హైదారాబాద్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స పొందుతుంది. ఈ మేరకు గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ ద్వారా ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేయగా యార్లగడ్డ సిఫార్సు మేరకు చికిత్స నిమిత్తం రూ.1.50 లక్షల ఎల్ ఓ సి మంజూరు చేశారు. మంజూరైన ఎల్ ఓ సి ని బుధవారం గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు తన కార్యాలయంలో బాధితురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆపదలో ఉన్న ఎన్నో కుటుంబాలను సీఎం సహాయ నిధి ఆపద్బంధువునిగా అదుకుం టుందని ఆయన తెలిపారు. మానవతా దృక్పథంతో ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి ఆర్థిక సహాయాన్ని మం జూరు చేస్తున్నారని అన్నారు. బాధితులు అవసరమైన సమయంలో సీఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

## ట్రిపుల్ ఐటీలో చోరీ




**నూజివీడు, మేజర్ న్యూస్:** నూజివీడు పట్టణంలోని ట్రిపుల్ ఐటీలో అకంతకులు చేసిన దొంగతనం తీవ్ర సంచలనంగా మారింది. ట్రిపుల్ ఐటీ వెనకవైపు ఉన్న ప్రహరీ గోడపై రక్షణ కంచను కత్తిరించి ప్రాంగణంలోకి అగంతకులు ప్రవేశించినట్లుగా ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. ఎంతో పటిష్టమైన సెక్యూరిటీ ఉన్న ట్రిపుల్ ఐటి క్యాంపస్ లోకి అగంతకులు ఎలా ప్రవేశించారనే అంశంపై కళాశాల యాజమాన్యం తేటతెల్లమ్ చేయవలసి ఉంది. నిరంతరం పహారా కాసే సెక్యూరిటీ కళ్ళు కప్పి అగంతకులు ప్రవేశించి అధ్యాపకులు నివసించే నాలుగవ అంత, రెండవ అంతస్తులుని పోర్షన్లను టార్గెట్ చేసి తలుపులు బద్దలు కొట్టి చోరీ చేశారు. ఈ సంఘటనకు సంబంధించి పట్టణ ఎస్సై డి రామకృష్ణ మాట్లాడుతూ ఒక పోర్షన్లో 15 గ్రాముల బంగారు ఉంగరాలు, 1.90 లక్షల రూపాయల నగదు చోరీ చేసినట్లు తెలిపారు. మరొక పోర్షన్ కు సంబంధించిన అధ్యాపక కుటుంబం ఊరు వెళ్లడం వలన చోరీ వివరాలు తెలియ రాలేదన్నారు. ఆ కుటుంబం క్యాంపస్ లోకి ప్రవేశిస్తేనే చోరీకి సంబంధించిన వివరాలు తెలుస్తాయని స్పష్టం చేస్తున్నారు. ఈ సంఘటనలో ఏలూరు జిల్లాకు చెందిన స్పెషల్ క్లూస్ టీం సభ్యులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, అగంతుకుల వేలిముద్రల కోసం ప్రయత్నం కొనసాగించారు.

# అక్రమ గ్రావెల్ తవ్వకాలపై విచారణ చేపట్టాలి




**నందిగామ, ఆగస్టు 21, మేజర్ న్యూస్ :** మండలంలోని రాఘవాపురం పల్లగిరి గట్టు లలో ఉన్నటువంటి కొండలలో అక్రమంగా తవ్వుతున్నటువంటి గ్రావెల్ తవ్వకాలను నిలుపుదల చేయాలని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చుండూరు వెంకట సుబ్బారావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్ర బాబు డిమాండ్ చేశారు.రాఘవాపురం పల్లగిరి గట్టు ప్రాంతాలలో అక్రమ గ్రావెల్ తవ్వకాలను నిలుపుదల చేయాలని కోరుతూ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో రాఘవపురం గ్రావెల్ క్వారీలో అక్రమ తవ్వకాలను పరిశీలించారు. అనంతరం నందిగామ ఆర్డీవో కార్యాలయం ఏవోకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పరుచూరి రాజేంద్ర, చుండూరు సుబ్బారావులు మాట్లాడుతూ రాఘవాపురం పల్లగిరి గట్లను ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కాంట్రాక్టర్లు, ప్రైవేట్ వ్యక్తులు, అధికార పార్టీ నాయకులు, అధికారులు కుమ్మక్కై తోవేస్తున్నారని రాఘవాపురం గట్టునుండి నందిగామ జాతీయ రహదారి నిర్మాణానికి వందలాది టిప్పర్ల మట్టి అక్రమంగా తరలిస్తున్న అధికారులు కల్లుండి చూడలేనటువంటి వ్యక్తులుగా వ్యవహరిస్తు న్నారని, రాజకీయ నాయకుల ప్రోత్భలంతోనే రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే కోట్లాది రూపాయల ప్రజాధనం కొంతమంది కాంట్రాక్టర్లు కొల్లగొడుతున్న పట్టించుకునే పరిస్థితి లేదని ఇప్పటికే సుమారుగా 5 కోట్ల పైచిలుకు విలువ కలిగినటువంటి మట్టిని జాతీయ రహదారి ఫ్లైఓవర్ నిర్మాణానికి వినియోగించడం జరిగిందని సంబంధిత అధికారులు మామూళ్ల మత్తులో తోగుతూ చూసి చూడనట్టు వ్యవహరించడం సరికాదని తక్షణమే జాతీయ రహదారి నిర్మాణ కాంట్రాక్టర్ వద్ద నుండి ఇప్పటివరకు తోలినటువంటి గ్రావెల్ కి పెనాల్టీ వసూలు చేయాలని కోరారు. ఎప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే గ్రావెల్ అక్రమ తవ్వకాలు నిలుపుదల చేయకుంటే సిపిఐ ఆధ్వర్యంలో దశలవారి ఆందోళన నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్, భూగర్భ గనుల శాఖ మంత్రి, నన్ను కలిసి సమస్యను వివరిస్తామని తెలియజేశారు. తక్షణమే గ్రావెల్ తవ్వకాలు నిలుపుదల చేయకుంటే సిపిఐ గా గ్రావెల్ తవ్వకాలు అడ్డుకోవడంతోపాటుగా జాతీయ రహదారి నిర్మాణ పనులను సైతం అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు లంక గోవిందరాజులు, సిపిఐ మండల కార్యదర్శి మన్నే హనుమంతరావు, సిపిఐ సీనియర్ నాయకులు పోల్నిడి. నాగభూషణం, షేక్. కాసిం, కట్టా శ్రీకాంత్, కంభంపల్లి గిరి తదితరులు పాల్గొన్నారు.





## శివకోటి కి ఘనంగా నివాళులర్పించిన బండి రామకృష్ణ

**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** స్వర్ణకారులకు ఎనలేని సేవలు అందించిన జిల్లా స్వర్ణకార సంఘం అధ్యక్షులు టిడిపి నాయకులు శివకోటి హఠాన్మరణం దిగ్భ్రాంతిని కలిగించిందని బండి రామమృష్ణ అన్నారు. శివకోటి రాజేంద్ర ప్రసాద్ సంస్మరణ కార్యక్రమంలో బండి రామకృష్ణ పాల్గొని మాట్లాడుతూ నవ్వుతూ ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించే మంచి మనసున్న వ్యక్తి మన మధ్య లేకపోవడం చాలా బాధించిందని, శివకోటి లేని లోటు తీరనిదని అన్నారు. రాష్ట్ర స్వర్ణకార సంఘ కార్యదర్శి జనసేన పార్టీ నగర అధ్యక్షులు గడ్డంరాజు మాట్లాడుతూ శివకోటి రాజేంద్రప్రసాద్ తో తనకు విడదీయరాని బంధం ఉందని స్వర్ణకారులకు మెరుగైన సేవలు అందించేందుకు నిరంతరం శివకోటి కృషి చేశారని అన్నారు. కరోనా సమయంలో స్వర్ణకారులకు చేయూతను అందించడంలో స్వర్ణకార కుటుంబాలకు ప్రభుత్వం నుండి సహాయం అందించడంలో శివకోటి పాత్ర మరువలేనిదని గడ్డం రాజు తెలిపారు. స్వర్ణకార సంఘ మచిలీపట్నం అధ్యక్షుడు చిట్టూరి శివప్రసాద్, జిల్లా అధ్యక్షులు శివకోటి రాజేంద్రప్రసాద్ ఇరువురిని రోజుల వ్యవధిలోనే కోల్పోవడం స్వర్ణకార సంఘానికి అగాధం ఏర్పడిందని ఇద్దరు మంచి మిత్రులను కోల్పోవడం వ్యక్తిగతంగా తనకు తీరని లోటని రాష్ట్ర స్వర్ణకార సంఘ కార్యదర్శి గడ్డంరాజు వారిరువుతో ఉన్న అనుబంధాన్ని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మచిలీపట్నం ఇన్చార్జి బండి రామకృష్ణ, రాష్ట్ర స్వర్ణకార సంఘ కార్యదర్శి మచిలీపట్నం జనసేన పార్టీ నగర అధ్యక్షులు గడ్డంరాజు, టిడిపి మచిలీపట్నం నగర అధ్యక్షులు ఇలియాస్ భాష, టిడిపి బీసీ సెల్ అధ్యక్షులు గోకుల్ శివ, స్వర్ణకారులు పాల్గొన్నారు.

## నిందితులను కఠినంగా శిక్షించాలి



**జగ్గయ్యపేట ఆగస్టు 21 మేజర్ న్యూస్ :** కలకత్తాలో ట్రైనీ డాక్టర్ పై జరిగిన అత్యాచారం, హత్యను ఖండిస్తూ పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద బుధవారం సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి కోట కృష్ణ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో ఇటువంటి సంఘటన జరగటం దురదృష్టకరమని, ట్రైనీ డాక్టర్ పై అత్యాచారం, హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించి చర్యలు తీసుకోవాలని, మహిళ డాక్టర్లకు, మహిళా సిబ్బందికి ప్రతిష్టమైన భద్రత కల్పించాలని, వైద్యుల న్యాయమైన డిమాండ్లను కేంద్ర వైద్య శాఖ రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని మహిళలకు, డాక్టర్స్ కు ప్రతిష్టమైన భద్రత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రక్షణ కల్పించాలన్నారు. ఈ సంఘటన జరిగి దేశవ్యాప్తంగా ప్రజలు, విద్యార్థులు, కార్మికులు, ఉద్యోగులు ఆందోళన చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గమన్నారు. మహిళలకు రక్షణగా అనేక చట్టాలు తెచ్చుకున్న అమలకు నోచుకోవటం లేదన్నారు. దేశంలో ఉన్న మెడికల్ కాలేజీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, మహిళలకు ప్రత్యేక రక్షణ కల్పించే విధంగా సిబ్బంది నియమించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం మెడికల్ కాలేజీలో ప్రత్యేక సిబ్బందిని నియమించుకోలేకపోవడం వలన ఇలాంటి సంఘటన జరిగిందన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ట్రైన్ డాక్టర్ కుటుంబాన్ని ఆదుకోవాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి షేక్ గౌస్ మియా, ఆశ వర్కర్లు జీ రేణుక, సిహెచ్ జ్యోతి, టీ కల్పన, కే బేబీరాణి, టి మాధవి, ఎస్ శారద, మధ్యాహ్న భోజన కార్మికులు పద్మ, మదర్ బీ, మున్సిపల్ వర్కర్స్ పారా ఎలకమ్మ, సిఐటియు నాయకులు కోట రవికుమార్, రావేళ్ళ శేషు, బాలు తదితరులు పాల్గొన్నారు.

## కొణిదెల నిహారికకు స్వాగతం పలికిన బండి రామకృష్ణ



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** కమిటీ కుర్రోళ్ళు సినిమా ప్రమోషన్‌లో భాగంగా మచిలీపట్నం విచ్చేసిన కొణిదెల నిహారికకు స్వాగతం పలికిన మచిలీపట్నం జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకృష్ణ. అనంతరం నిహారికతో మాట్లాడుతూ జనసేన పార్టీ అధ్యక్షులు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఐదు రోజులు తన నివాసంలో ఉన్న విషయాన్ని నిహారికకు తెలియపరుస్తూ మధ్యాహ్నం నిహారికను తమ నివాసంలో ఆతిథ్యం స్వీకరించవలసిందిగా బండి రామకృష్ణ ఆహ్వానించారు. ప్రమోషన్ లో భాగంగా భీమవరం వెళ్లవలసి ఉన్నదని సమయం తక్కువగా ఉన్నందున మరోసారి తప్పకుండా మీ ఆతిథ్యాన్ని స్వీకరిస్తానని మీ అభిమానాన్ని ఎప్పటికీ మరువలేనని రామకృష్ణకు నిహారిక కృతజ్ఞతలు తెలిపారు. జనసేన పార్టీ నగర అధ్యక్షులు గడ్డంరాజు డివిజన్ ఇంచార్జిలు పృద్వి, గణేష్, సాయి,నాగరాజు, శివయ్య, హరి, మైఖేల్ జనసేన పార్టీ శ్రేణులు పుర ప్రముఖులు పాల్గొన్నారు.

## సింహాచలం వరాహలక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకున్న మంత్రి కొల్లు రవీంద్ర



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** సింహాచలం వరాహ లక్ష్మీ నరసింహస్వామిని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర దర్శించుకున్నారు. ఆలయ ఈవో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అర్చకులు ఆశీర్వాదం ఇచ్చారు. స్వామివారి చిత్ర పటం, ప్రసాదం అందించారు.

## బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ నిరసిస్తూ చేపట్టిన భారత్ బంద్ కార్యక్రమంలో ఎటువంటి సంఘటనలు జరగకుండా నిర్వహిస్తున్న బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర రావు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన సందర్భంగా సదరు తీర్పును నిరసిస్తూ కొన్ని వర్గాలు వ్యతిరేకతను వ్యక్తపరుస్తూ బుధవారం భారత్ బంద్ కు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుండే కృష్ణా జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా వ్యాప్తంగా బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, విద్యాసంస్థలు, ముఖ్య కూడళ్ల వద్ద కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ రావు, స్వయంగా బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు జారీ చేశారు.

## అంగన్వాడి కేంద్రాలను ప్రత్యేక అధికారి ఆకస్మిక తనిఖీ



**నందిగామ, ఆగస్టు 21, మేజర్ న్యూస్:** మండలంలోని కంచల గ్రామంలో బుధవారం ఎన్టీఆర్ జిల్లా ప్రత్యేక అధికారిని ఉమాదేవి పలు అంగన్వాడీ కేంద్రాలు, ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం మధ్యాహ్న భోజన పథకం పనితీరు విద్యాబోధనపై పరిశీలించారు.. పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం పెరిగేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో పెరటి మొక్కల పనితీరు.. చిన్నారుల భోజనాన్ని పరిశీలించారు... పిల్లలకు వైరల్ ఫీవర్స్ అంటూ వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్య సమస్యలు ఎప్పటికప్పుడు ఆరోగ్య కార్యకర్తలు పాఠశాలలు అంగన్వాడీ కేంద్రాల్లో హెల్త్ చెకపోలు చేయాలని పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో సిడిపిఓ భాగ్య రేణుక సూపర్వైజర్ వెంకట్రావమ్మ పాఠశాలల ఉపాధ్యాయులు అంగనవాడి టీచర్లు పాల్గొన్నారు.

# వరద నీటిలో స్టాప్ లాగ్ గేటు ఏర్పాటు చేయడం రికార్డు

**ఫలితంగా తుంగభద్ర రిజర్వాయరులో 40 టి.ఎం.సి.ల వరద నీటిని కాపాడుకోగలిగాం**

**రాష్ట్ర రైతాంగం ప్రత్యేకించి రాయలసీమ రైతాంగం తరపున కన్నయ్య నాయుడికి కృతజ్ఞతలు**

**రాష్ట్ర జలవనరుల అభివృద్ధి శాఖ మంత్రి డా.నిమ్మల రామానాయుడు**



**అమరావతి, ఆగస్టు 20, మేజర్ న్యూస్:** వేల క్యూసెక్కుల వరద నీరు ప్రవహిస్తుండగా తుంగభద్ర 19 వ గేటు స్థానంలో స్టాప్ లాగ్ గేటును ఏర్పాటు చేయడం అనేది భారత దేశ చరిత్రలోనే ఒక అపూర్వమైన ఘట్టమ ని, అటు వంటి రికార్డును సృష్టించిన ప్రముఖ సాగునీటి రంగ నిపుణులు కన్నయ్య నాయుడుకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు రాష్ట్ర జలవనరుల అభి వృద్ధి శాఖ మంత్రి డా.నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. ఈ స్టాప్ లాగ్ గేటు ఏర్పాటు చేయడం వల్ల సుమారు 40 టి.ఎం.సి.ల నీరు వృదా కాకుం డా కాపాడుకోవడం జరిగిందన్నారు. బుధవారం రాష్ట్ర సచివాలయం పబ్లిసిటీ సెల్ లో సర్వేపల్లి నియోజక వర్గం శాసన సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ప్రముఖ సాగునీటి రంగ నిపుణులు, రిటైర్డ్ అధికారి కన్నయ్య నాయు డుతో కలసి మంత్రి పాత్రికేయులతో మాట్లడుతూ తుంగభద్ర రిజర్వాయరు 19 వ గేటు తీవ్రమైన వరదనీటికి కొట్టుకు పోవడంతో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రైతాంగం తీవ్ర ఆందోళనకు గురయ్యారన్నారు. అటు వంటి క్లిష్టపరిస్థితులో సంక్షోభాలను అధిగమిం చడంలో మంచి అను భవం ఉన్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనల మేరకు సాగునీటి రంగంలో దాదాపు 50 సంవత్సరాల అనుభవం ఉన్న శ్రీ కన్నయ్య నాయుడు సహకారంతో స్టాప్ లాగ్ గేటును ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. ఫలితంగా నేడు సుమారు 77 టి.ఎం.సి.ల నీరు ఆ రిజర్వా యరులో నిల్వ ఉండటం వల్ల రాయలసీమ ప్రాంతంలోని ఎల్.ఎల్.సి., హెచ్.ఎల్.సి., కె.సి. కెనాల్ కు సమృద్ధిగా త్రాగునీరు, సాగు నీరు అందించగలిగే పరిస్థితి ఏర్పడిందన్నారు. తుంగభద్ర గేటు కొట్టుకుపోయిం దని తెలిసిన వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అర్ధరాత్రి సైతం నాతో, అనంతపురం జిల్లాకు చెందిన మంత్రి పయ్యావుల కేశవ్, జలవనరుల శాఖ కార్యదర్శితో కాన్ఫరెన్సు నిర్వహించి అప్రమ త్తం చేయడం వల్లే ఈ సంక్షోభం నుండి గట్టెక్కగలి గామన్నారు. లేకుంటే తుంగభద్ర జలాశయం ద్వారా త్రాగు, సాగు నీరు పొందే అనంతపురం, కర్నూలు, కడప జిల్లాలతో పాటు తెలంగాణాకు చెందిన ప్రజలు, రైతులు ఎన్నోసమస్యలను ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడేదన్నారు. రాష్ట్ర రైతాంగం ప్రత్యేకించి రాయలసీమ రైతాంగం తరపున కన్నయ్య నాయుడికి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రముఖ సాగునీటి రంగ నిపుణులు కన్నయ్య నాయుడు మాట్లాడుతూ గత 52 ఏళ్లుగా సాగునీటి రంగంలో పనిచేస్తూ దక్షణాది రాష్ట్రాల్లో ఇలాంటి గేట్లు ఎన్నో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తుంగభద్ర డ్యామ్ ను 1954 లో కమిషనింగ్ చేయడం జరిగిందని, దాని కాలపరిమితి 45 ఏళ్లుకాగా, ఇప్పటి వరకూ దాదాపు 70 ఏళ్ల పాటు పనిచేయడం జరిగిందన్నారు. 1970 లోపు ఏర్పాటు చేయబడిన తుంగభద్ర, ప్రకాశం, నాగార్జున సాగర్ డ్యామ్లకు స్టాప్ లాగ్స్ లేవన్నారు. 2002 లో ప్రకాశం బ్యారేజ్ గేట్లు మార్చడం జరిగిందన్నారు. తీవ్రమైన వరదనీటిలో రిస్కుతీసుకుని తుంగభద్ర రిజర్వాయరు గేటు మార్చడం అనే పనిని చాలెంజ్ గా నిర్వహించడం జరిగిందన్నారు. 50 మంది సాయంతో ఐదు రోజుల్లో గేటు డిజైన్ చేసి ఏర్పాటు చేయడం అనేది ఒక రికార్డు అన్నారు. ఇప్పుడు 26 లక్షల ఎకరాలకు నీరు లభించినట్లు అయ్యిందన్నారు.



## కన్నయ్యనాయుడుని సన్మానించిన సీఎం చంద్రబాబు

**అమరావతి, ఆగస్టు 20, మేజర్ న్యూస్:** ప్రముఖ సాగునీటి రంగ నిపుణులు, రిటైర్డ్ అధికారి కన్నయ్య నాయుడుని ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు సన్మానించారు. వెలగపూడి సచివాలయంలో కన్నయ్య నాయుడుకి శాలువా కప్పి జ్ఞాపిక అందించి అభినందించారు. వరద పోటుతో ఇటీవల తుంగభద్ర జలాశయ 19వ గేటు కొట్టుకపోయింది. విషయం తెలుసుకున్న సీఎం చంద్రబాబు సమస్యను పరిష్కరించేందుకు కన్నయ్య నాయుడికి ఫోన్ చేసి అక్కడకు వెళ్లాలని కోరారు. పరిస్థితిని గాడిన పెట్టేందుకు ఎంతో శ్రమించిన కన్నయ్య నాయుడు వరద ప్రవాహం ఉధృతంగా కొనసాగుతున్న సమయంలోనే ఏపీ, కర్నాటక అధికారుల సహకారంతో స్టాప్ లాగ్ గేటు విజయవంతంగా అమర్చారు. దీంతో సుమారు 30 టీఎంసీల నీరు వృధా కాకుండా అడ్డుకోగలిగారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం కన్నయ్య నాయుడిని ప్రత్యేకంగా పిలిపించుకుని మాట్లాడారు. ప్రాజెక్టులో నీరు ఉండగానే స్టాప్ లాక్ గేటు అమర్చి నీరు వృధా కాకుండా రైతాంగానికి ఎంతో మేలు చేశారని ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర రైతాంగం తరపున కన్నయ్య నాయుడుకి సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## అచ్యుతాపురం ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలుడు ఘటనపై ముఖ్యమంత్రి తీవ్ర దిగ్భ్రాంతి

**అమరావతి, ఆగస్టు 20, మేజర్ న్యూస్:** అనకాపల్లి జిల్లాలోని అచ్యుతాపురం సెజ్ లోని ఎసెన్షియా ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలుడు ఘటనలో 7 గురు ప్రాణాలు కోల్పోవడం పై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది అనే సమాచారం పై సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాద ఘటన, బాధితులకు అందుతున్న సాయంపై ముఖ్యమంత్రి జిల్లా కలెక్టర్ తో ఫోన్ లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ ఘటనలో 7 గురు చనిపోగా... 30 మందికిపైగా తీవ్రంగా గాయపడి వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని జిల్లా అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. చికిత్స పొందుతున్న వారి ప్రాణాలు కాపాడేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఉన్నతాధికారులను, పరిశ్రమల శాఖ అధికారులను అక్కడే ఉండి పూర్తి స్థాయి సహాయక చర్యలు చేపట్టాలని సీఎం అదేశించారు.

# గ్లోబల్ గ్రీన్ ఎనర్జీ పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ గమ్యస్థానం

**ప్రపంచ పెట్టుబడిదారులను ఆకర్షిస్తున్నా ఆంధ్ర ప్రదేశ్**

**ఆంధ్రప్రదేశ్ క్లీన్ ఎనర్జీ సెక్టార్‌లో 5 బిలియన్ల యూ ఎస్ డాలర్ల పెట్టుబడికి బ్రూక్‌ఫీల్డ్ సుముఖం**

**3500 ఎంవీ సోలార్ , 5500 ఎంవీ పవన ప్రాజెక్టులను ఏర్పాటుచేస్తామని ఎవ్రన్ సంస్థ వెల్లడి**

**పెట్టుబడిదారులకు , ప్రజలకు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కు అనుకూల వాతావరణం కల్పిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం**

**పుష్కలంగా సౌర, పవన వనరులతో పునరుత్పాదక ఇంధన ఉత్పత్తికి ఆంధ్ర ప్రదేశ్ అనుకూలం.**

**ముఖ్యమంత్రి , ఇంధనశాఖామంత్రిలతో సమావేశమైన బ్రూక్ ఫీల్డ్ , యాక్సిస్ సంస్థల ప్రతినిధులు**



**విజయవాడ, ఆగస్టు 20, మేజర్ న్యూస్:** పునరుత్పాదక ఇంధన పెట్టుబడులకు ఉత్తమ గమ్యస్థానాలలో ఒకటిగా పరిగణించబడుతున్న ఆం ధ్రప్రదేశ్ రాష్ట్రంలో, 5 బిలియన్ల యూఎస్ డాలర్ల గ్రీన్ ఎనర్జీ పెట్టుబడులు పెట్టేందుకు , గ్లోబల్ ఇన్వెస్టింగ్ సంస్థ బ్రూక్‌ఫీల్డ్, యాక్సిస్ ఎనర్జీ ప్రమోట్ చేసిన క్లీన్ ఎనర్జీ ప్లాట్‌ఫారమ్ ఎవ్రెన్ ముందుకొచ్చింది. బ్రూక్‌ఫీల్డ్ , యాక్సిస్ యాజమాన్య బృందం ఏపీ సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడుతో పాటు ఇంధన శాఖా మంత్రి గొట్టిపాటి రవికు మార్‌తో సమాఎ శమయ్యారు. రాష్ట్రంలో దశల వారీగా 3500 మెగావాట్ల సోలార్ , 5500 మెగా వాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టులను ఏర్పాటు చేసేం దుకు సిద్ధంగా ఉన్నట్లు ఎవ్రెన్ సంస్థ ప్రతినిధులు వెల్లడించారు. వీటిలో 3000 మెగావాట్ల ప్రాజెక్టు లకు ఇప్పటికే రాష్ట్రంలో శంకుస్థాపన జరిగిందని, 2026 చివరి నాటికి ఆ ప్రాజెక్టులు ప్రారంభమవు తాయని తెలిపారు. పునరుత్పాదక ఇంధన పెట్టు బడుల ప్రణాళికలే కాకుండా, ఇంటిగ్రేటెడ్ మా డ్యూల్ తయారీ, పంప్డ్ స్టోరేజ్, బ్యాటరీ స్టోరేజ్, ఈ -మొబిలిటీ, గ్రీన్ అమ్మోనియా వంటి వాటిలో రాష్ట్రంలో అదనపు అవకాశాలను ఎవ్రెన్ అన్వేషిస్తోంద న్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు అనువైన విధానాలను అమలుచేస్తోందని, పెట్టుబడిదారులకు, ప్రజలకు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో సమయా నుకూల అనుమతులతో పాటు పారదర్శకతను ప్రోత్సహించేందుకు, రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడులకు అనుకూల వాతావర ణాన్ని కల్పిస్తుందన్నారు. ఇంధన రంగంలో పెట్టుబడులను సాకారం చేయడం ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లో నూతన అవకాశాలకు, ఉద్యోగ కల్పనకు, స్థిరమైన అభివృద్ధి సాధించేం దుకు పుష్కలంగా అవకాశాలున్నాయన్నారు. సౌర, పవన ఇంధన వనరులతో పునరుత్పాదక ఇంధన ఉత్పత్తికి ఏపీ లో ఆకాశాలు మెండుగా ఉన్నాయని తెలిపారు . సోలార్ పార్కులు, రూఫ్ టాప్ సోలార్ సిస్టమ్‌లు, పంప్డ్ హైడ్రో స్టోరేజీ ప్రాజెక్టుల ఏర్పాటుకు ప్రభుత్వం ఇప్పటికే చర్యలు తీసుకుంటోందని ఇంధన శాఖా మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. సుమారు 1 ట్రిలియన్ యు ఎస్ డాలర్లతో ప్రపంచవ్యాప్తంగా 2,40,000 మంది ఉద్యోగులతో ఇన్వెస్ట్మెంట్ మేనేజ్మెంట్ లో బ్రూక్‌ఫీల్డ్ గ్లోబల్ లీడర్‌గా ఉందని బ్రూక్ ఫీల్డ్ అధికారులు తెలిపారు. బ్రూక్‌ఫీల్డ్ రెన్యూవబుల్స్ పునరుత్పాదక ఇంధ నాన్ని, ప్రపంచ ఇంధన పరివర్తన, వాతావరణ పరివర్తన కు సంబంధించిన కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడానికి 100 బిలియన్ యూఎస్ డాలర్లతో ఐదు ఖండాలలో విస్తరించి ఉన్న హైడ్రో, పవన, సౌర, స్టోరేజి , విద్యుత్ పంపిణి వంటి వాటి లో 7,000 కంటే ఎక్కువ విద్యుత్ ఉత్పాదక సౌకర్యాలలో 33,000 మెగావాట్లకు మించి ఉత్పాదక సామర్థ్యం కలిగి ఉందన్నారు. బ్రూక్‌ఫీల్డ్ రెన్యూవబుల్స్ 5 ఖండా లలో విస్తరించి ఉన్న బహుళ పునరుత్పాదక సాంకేతికతలలో 155,000 మెగావాట్ల గ్లోబల్ డెవలప్మెంట్ పైప్‌లైన్‌ను కలిగి ఉందన్నారు. బ్రూక్‌ఫీల్డ్ సంస్థ, దశాబ్దానికి పైగా నైపుణ్యం కలిగిన క్లీన్‌టెక్ కంపెనీ అయిన యాక్సిస్ ఎనర్జీ వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌తో బలమైన భాగస్వామ్యాన్ని ఏర్పరుచుకుందని, 2019లో పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులను అమలు చేసి, 1.8 జీడబ్ల్యూ సౌర, పవన ప్రాజెక్టులను విజయవంతంగా అభివృద్ధి చేసిందని తెలిపారు. దేశంలో క్లీన్ ఎనర్జీ ఇన్వెస్ట్‌మెంట్‌లను ముందుకు తీసు కు వెళ్లేందుకు బ్రూక్‌ఫీల్డ్, యాక్సిస్ ఎనర్జీ మధ్య 51:49% హోల్డింగ్‌తో ఎవ్రెన్ సంస్థ ను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఉద్యోగాల కల్పన, పన్ను సహకారం ద్వారా రాష్ట్ర ఆర్థిక వృద్ధికి ఈ పెట్టుబడులు ఎంతగానో తోడ్పడతాయని, ఈ పెట్టుబడి ప్రణాళికలు ఆంధ్రప్రదేశ్ లో ఇంధన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం, ప్రపంచ ఇంధన పరివర్తనకు సహాయపడడంలో ఎవ్రెన్ నిబద్ధతను తెలియచేస్తుందని, అలాగే క్లీన్ ఎనర్జీ పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్‌ను వారి ప్రధాన గమ్యస్థానంగా మారు స్తుందని బ్రూక్‌ఫీల్డ్ అధికారులు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ లతో సమావేశం అయిన వారిలో బ్రూక్ ఫీల్డ్ మేనేజింగ్ డైరెక్టర్లు నావల్ సైనీ, ముర్జాష్ మనీక్షణ, ఎవ్రన్ సంస్థ ఎండీ రవి కుమార్ రెడ్డి, సీఈఓ సుమన్ కుమార్, యాక్సిస్ సీఈఓ మురళి, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ డీవీవీ సత్య ప్రసాద్ లు ఉన్నారు.



# సృజనాత్మక ఆవిష్కరణలు పెట్టుబడులుగా మారి సమాజాభివృద్ధికి తోడ్పడాలి

**సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్**



**విజయవాడ, మేజర్ న్యూస్:** ఈనెల 13,14 తేదీలలో జరిగిన హ్యాకథాన్ కేవలం పోటీ మాత్రమే కాదని, సృజనాత్మక ఆవిష్కరణ, వ్యవస్థాపక స్ఫూర్తికి నిదర్శనమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. అటల్ ఇన్నోవేషన్ సెంటర్ మహిళా సాధికారిక కేంద్రం ఆధ్వర్యంలో మైత్రీ ఈయర్ గ్రాంట్ అవార్డు సాధించిన పలువురు వ్యవస్థాపకులకు అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు తమ ప్రతిభను, వినూత్న ఆలోచనలను ప్రదర్శించడానికి సరియైన వేదికను అందించడంలో ఏలిప్ చేస్తున్న కృషి, భారతదేశంలో వ్యవస్థాపకత, సాంకేతిక పురోగతిని పెంపొందించే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆశయాలకు సంపూర్ణంగా తోడ్పాటును అందిస్తుందని చెప్పారు. అతి తక్కువ వ్యవధిలో 80 రకాల ఆలోచనలను సమర్పించడం అనేది చిన్న విషయం కాదని, ప్రతి ఆలోచన కృషి, సృజనాత్మకత, సాంకేతికత ద్వారా ప్రపంచంలో మార్పు తీసుకురావాలనే నిబద్ధతను సూచిస్తుందని తెలియజేశారు. యువత నుండి అలాంటి ఉత్సాహాన్ని చూసి ప్రత్యేకంగా గర్వపడుతున్నానని, మన భవిష్యత్తు సమర్థుల చేతుల్లో ఉందనే భరోసా కలుగుతుందని చెప్పారు. సమాచార ఎలాక్ట్రానిక్స్ , టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ద్వారా గుర్తించబడిన ముగ్గురు అత్యుత్తమ ఆలోచనలు ఉన్నవారిని గౌరవించటానికి ఏర్పాటుచేసిన ఈవేదికలో నేను ముఖ్య అతిథిగా పాల్గొనటం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. ఈ ఆలోచనలు వారి సాంకేతిక యోగ్యతకే కాకుండా, సమాజానికి దోహదడే అంచాలకు అనుగుణంగా ఉన్నాయని తెలిపారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రిగా ఈ ఆవిష్కరణలను ఆచరణీయ వ్యాపారాలలోకి తీసుకొచ్చే ప్రయత్నాలకు తోడ్పాటు అన్నివిధాల ఉంటుందని భరోసా నిచ్చారు . సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల రంగం భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని, ఆవిష్కరణ వ్యవస్థాపకత ద్వారా ఈ రంగాన్ని బలోపేతం చేయడంకోసం ప్రతి ఒక్కరు ముందుకురావాలని ఆకాంక్షించారు. ఈ హ్యాకథాన్ వంటి కార్యక్రమాలు కేవలం అవార్డులు గెలుచుకోవడానికి మాత్రమే కాదని అవి పెట్టుబడుల సాధించటం ద్వారా భవిష్యత్తు తరాలకు మార్గనిర్దేశం కావాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు. ఎలిప్ ఆధ్యక్షురాలు కన్నెగంటి రమాదేవి మాట్లాడుతూ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు అభివృద్ధికి అవకాశం ఉన్న రంగాలను ఎంచుకొని ఆయా రంగాలలో వృద్ధి సాధించాలని చెప్పారు. చదువుకున్న వారిలో ఎక్కువమంది స్టార్టప్ ల వైపు చూస్తున్నారని, వారి భవిష్యత్తుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సరైన మార్గం చూపుతోందని ఆకాంక్షించారు. ఈ పోటీ యుగంలో మహిళలు దేనికి తీసుకోరని పాటాలో చిప్స్ నుంచి ఎలక్ట్రానిక్ చిప్స్ వరకు అన్నింటినీ మహిళలు తయారు చేయగలరని అందుకు కీర్తి వంటి ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు సాధించిన విజయాలే నిదర్శనమని చెప్పారు. నూతన ఆవిష్కర్తలు తమ అనుభవాలను పలువురితో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో మేరీస్ స్టెల్లా కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్సార్ లీనా క్వార్డస్, మహిళా సాధికారిక మేధోసంపత్తి శిక్షణ కేంద్రం ఉపాధ్యక్షురాలు డాక్టర్ పి జ్యోతిరావు, పలువురు నూతన ఆవిష్కర్తలు విద్యార్థులు పాల్గొన్నారు.

# దేశంలోనే బెస్ట్ ఇండస్ట్రీ పాలసీ రూపొందిస్తాం

## రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతాం

**ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఊతమిస్తాం.**

**సింగిల్ విండో పాలసీన సమర్థవంతంగా అమలు చేస్తాం**

**యువతలో నైపుణ్యాలు పెంచేవిధంగా చర్యలు తీసుకుంటాం**

**పాలసీ రూపకల్పనలో అందరి సలహాలు, సూచనలు స్వీకరిస్తాం**

**యువతకు ఉపాధి కల్పన పై దృష్టిపెడతాం**

**నేటి యువత టెక్నాలజీ అందిపుచ్చుకునే విధంగా నైపుణ్య శిక్షణ అందిస్తాం**

**పారిశ్రామికవేత్తలకు అవసరమైన సహాయ, సహకారాలు అందిస్తాం**

**రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ సాధికారత, సంబంధాల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్**




**విజయవాడ, మేజర్ న్యూస్:** వికసిత్ ఆంధ్రప్రదేశ్ లో భాగంగా దేశంలోనే బెస్ట్ ఇండస్ట్రీ పాలసీని రూపొందించనున్నామని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ సాధికారత, సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. నూతన ఇండస్ట్రీ పాలసీ రూపకల్పన లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం, ఏపీఐఐసీ, సీఐఐల సంయుక్త ఆధ్వర్యంలో స్టేక్ హోల్డర్స్ సమావేశం విజయవాడలోని ఓ ప్రైవేట్ హోటల్ లో బుధవారం జరిగింది. సమావేశంలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీ.జీ. భరత్ వర్చువల్ గా తన సందేశాన్ని అందించారు. స్టేక్ హోల్డర్స్ సమావేశంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపిస్తుండటం శుభసూచకమన్నారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతామని చెప్పారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఊతమిస్తే అద్భుతాలు సృష్టించవచ్చన్నారు. సింగిల్ విండో పాలసీని సమర్ధవంతంగా అమలు చేస్తామని తెలిపారు. సింగిల్ విండో పాలసీ అమలులో భాగంగా నెలకు రెండు సార్లు సమావేశాలు నిర్వహించి దరఖాస్తుల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. లైఫ్ సైన్సెస్, ఫార్మా, టెక్స్ టైల్స్, ఫుడ్ ప్రాసెసింగ్, ఆటో రంగం, బయోటెక్ రంగాలతో పాటు అన్ని రంగాలకు ప్రాధాన్యత కల్పించి ఏపీని పారిశ్రామిక రంగంలో దేశంలోనే టాప్ గా నిలబెట్టాలన్న లక్ష్యంతో ముందు సాగుతున్నామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో ఇంజనీర్లు, గ్రాడ్యుయేట్లు ఉన్నారని ఇది రాష్ట్రానికి బలమని, వారిలో పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను పెంచి స్థానికంగానే వారికి ఉపాధి కల్పించడమే ధ్యేయమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను అందించేందుకు యూనివర్శిటీలతో, కాలేజీలతో మాట్లాడి కరిక్యులమ్ లో కొన్ని మార్పులు చేసి వారికి ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇండస్ట్రీలకు అవసరమైన నైపుణ్యాలు కలిగిన యువత తక్కువగా ఉన్నారని తమ దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను అందింపుచ్చుకునేలా యువతకు తర్ఫీదు ఇస్తే వారు ఇక్కడే మంచి ఉద్యోగాలు సాధిస్తారని గుర్తించడం జరిగిందన్నారు. నూతన ఇండస్ట్రీ పాలసీ రూపకల్పనలో సూచనలు, సలహాలు అందించాలనుకునే వారు ఈ మెయిల్, పోస్ట్ ద్వారా కూడా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా నూతన ఇండస్ట్రీ పాలసీ కూడా సీఎం చంద్రబాబు ప్రకటించనున్నారు. వికసిత్ ఆంధ్రప్రదేశ్ కు మొదటి అడుగుగా నూతన ఇండస్ట్రీ పాలసీ ఉండబోతున్నారు. దేశంలోనే పారిశ్రామికంగా ముందున్న ఐదు రాష్ట్రాల ఇండస్ట్రీల పాలసీలను స్టడీ చేసి మన రాష్ట్రంలో వాటి రిజల్ట్ ఎలా ఉంటాయని పరిశీలించి బెస్ట్ పాలసీని అందించనున్నట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.

మెడ్ టెక్ పార్క్ తరహాలోనే రాష్ట్రంలో మరిన్ని సెక్టార్ బెస్ట్ ఇండస్ట్రీ పార్క్ లను అభివృద్ధి చేయనున్నామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. మాన్యుఫ్యాక్చరింగ్, సర్వీస్ ఇండస్ట్రీస్ ఏర్పాటు లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. నేటి స్పీడ్ యుగంలో రోజు రోజుకు టెక్నాలజీ మారిపోతుందని, ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్) వేగంగా అభివృద్ధి చెందుతుందని, ఆ నైపుణ్యాలు మన యువతకు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం, ప్రైవేట్ ప్రజల భాగస్వామ్యం (పిపిపి పార్టనర్ షిప్) తో అద్భుతాలు సృష్టించవచ్చని, ఎంఎస్ఎంఈ ల స్థాపనతో స్థానిక యువతకు పెద్ద సంఖ్యలో ఉపాధి లభిస్తుందన్నారు. ఎంఎస్ఎంఈల స్థాపనకు ప్రత్యేకంగా కృషి చేస్తామన్నారు. టెక్స్ టైల్ రంగంలో పెద్ద సంఖ్యలో యువతకు ఉపాధి, ఉద్యోగకల్పన జరుగుతుందని మంత్రి తెలిపారు. పరిశ్రమల శాఖామంత్రి టిజి భరత్ వర్చువల్ గా స్టేక్ హోల్డర్స్ తో మాట్లాడుతూ 25 సంవత్సరాల క్రితమే సీఎం చంద్రబాబు ఒక సీఈవోలా పనిచేసి రాష్ట్రానికి పెట్టుబడుల వరద పారించారని, పారిశ్రామికవేత్తలకు ప్రోత్సహించడంతో పెద్ద సంఖ్యలో పరిశ్రమలు, కంపెనీలు తరలివచ్చాయని గుర్తుచేశారు. నూతన ఇండస్ట్రీ పాలసీని వంద రోజుల ప్రణాళికలో భాగంగా సెప్టెంబర్ లో తీసుకురానున్నామన్నారు. నూతన ఇండస్ట్రీపాలసీ బెస్ట్ గా ఉండేవిధంగా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. పాలసీ రూపొందించడంలో పెట్టుబడులే లక్ష్యంగా ముందకు వెళుతున్నామని, పరిశ్రమలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పిస్తామని హామీ ఇచ్చారు. రోడ్లు, విద్యుత్, నీరు తదితర మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని మంత్రి టి.జి. భరత్ తెలిపారు.

సమావేశంలో పాల్గొన్న స్టేక్ హోల్డర్స్ తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. వారి సూచనలు, సలహాలను ఖచ్చితంగా స్వీకరిస్తామని మంత్రి తెలిపారు. అలాగే స్టేక్ హోల్డర్స్ సమస్యలను విన్నవించగా వాటిని పరిష్కరిస్తామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ చేనేత, జౌళి శాఖ సెక్రటరీ కె. సునీత, ఇండస్ట్రీస్ శాఖ కార్యదర్శి ఎన్. యువరాజ్, పరిశ్రమల వాణిజ్య శాఖ డైరెక్టర్ చెరుకూరి శ్రీధర్, చేనేత, జౌళి శాఖ కమిషనర్ జి. రేఖారాణి, సీఐఐ ఏపీ ఛైర్మన్ వి.మురళీ కృష్ణ, సీఐఐ ఏపీ మాజీ ఛైర్మన్ జెఎస్ఆర్కె ప్రసాద్, ఏపీఐఐసీ వైస్ ఛైర్మన్ అభిషేక్ కిషోర్, స్టేక్ హోల్డర్స్ పాల్గొన్నారు.

# ఉద్యోగ భద్రత కల్పించండి



## మద్యం దుకాణాల్లో ఉద్యోగులు

**గన్నవరం (నిడమానూరు), ఆగస్టు 21, మేజర్ న్యూస్ :** మద్యం దుకాణాల్లో పనిచేస్తున్నా ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రతీనెల సమయానికి జీతాలు అందేలా చూడాలని వైన్ షాప్స్ కాంట్రాక్టు అండ్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో వైన్ షాప్స్ ఉద్యోగులు విజయవాడ రూరల్ మండలం నిడమానూరు లోని ఐ.ఎం.ఎఫ్.ఎల్ డిపో మేనేజర్ కి వినతి పత్రం అందజేశారు.

ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ డిపో మేనేజర్ కు ఉద్యోగ భద్రత, నెలాఖరు వచ్చిన జీతాలు అందని పరిస్థితులు గురించి వివరించమని వారు అందుకు సానుకూలంగా స్పందించారని తమ సమస్యలను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేసే విధంగా కృషి చేస్తామని తెలిపారు అని అన్నారు. అదే విధంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అక్టోబరు 1 నుంచి నూతన మద్యం పాలసీ తీసుకుని వస్తామని ప్రకటించడంతో బేవరేజ్ సంస్థలో పనిచేస్తున్న వేలాది మంది ఉద్యోగాలు కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నూతన మద్యం విధానాన్ని తీసుకువచ్చి తమ ఉద్యోగాలు తొలగించే పరిస్థితి వస్తే.. ఇతర సంస్థల్లో నైనా తమకు ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో ఉద్యోగాలు కల్పించాలని కోరారు. లేదంటే సుమారు 17 వేల కుటుంబాలు రోడ్డున పడతాయని, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ సమస్యపై ఇదివరకే ప్రభుత్వ అధినేతలను కలిశామని మరొకసారి సమస్యను ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తామని వారు తప్పక న్యాయం చేస్తారని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

### అమరావతి అభివృద్ధిలో..

# రియల్ ఎస్టేట్ రంగం భాగస్వామ్యం కావాలి



**విజయవాడ మేజర్ న్యూస్ :** అమరావతి అభివృద్ధిలో రియల్ ఎస్టేట్ రంగం భాగ స్వామ్యం కావాలని మంత్రులు నారాయణ, నాదెండ్ల మనోహర్, కొలుసు పార్ధసారధి పిలుపునిచ్చారు. బుధవారం గురునానక్ కాలనీ లోని ఎన్ ఎ సి కల్యాణ మండపంలో నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్మెంట్ కౌన్సిల్ (నారెడ్కో ) ఆధ్వర్యంలో మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమం లో మంత్రి నాదెండ్ల మనోహర్,ఎంపీ కేశినేని చిన్ని,శాసన సభ్యులు గద్దె రామమోహన్, బోడె ప్రసాద్, యార్లగడ్డ వెంకట్రావు,గల్లా మాధవి, భాష్యం ప్రవీణ్ పాల్గొన్నారు. తొలుత మంత్రి నాదెండ్ల మనోహర్ జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన వారందరిని నారెడ్కో ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రులు నారాయణ, నాదెండ్ల మనోహర్, కొలుసు పార్ధసారధి లు మాట్లాడుతూ గత ప్రభుత్వం రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని విమర్శించారు. ఇసుక కొరత సృష్టించి రియల్ ఎస్టేట్ రంగాన్ని నిర్వీర్యం చేసిందన్నారు. భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి లేకుండా చేసిందన్నారు. రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధి కి తమ వంతు సహకారం అందిస్తామని అన్నారు. అనంతరం ఎంపీ కేశినేని చిన్ని మాట్లాడుతూ సీఎం చంద్రబాబు దూరదృషి వలనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమం నుద్దేశించి నారెడ్కో రాష్ట్ర అధ్యక్షులు గద్దే చక్రదర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం వలన రాష్ట్రం అన్ని రంగల్లో అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ఇసుక ఇబ్బంది వలన రియల్ ఎస్టేట్ రంగం కుదేలు అయ్యిందన్నారు. మూడు రాజధానుల పేరుతో కృష్ణ, గుంటూరు నగరాలు అభివృద్ధి చెందలేదన్నారు. రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అభివృద్ధిలో పరుగులు తీస్తుందన్నారు. ప్రభుత్వం రియల్ ఎస్టేట్ రంగాన్ని ప్రోత్సహించాలని ఆయన కోరారు.

# మహిళలకు భద్రత కల్పించలేని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు



**నందిగామ, ఆగస్టు 21, మేజర్ న్యూస్:**సిఐటియు నందిగామ కమిటీ ఆధ్వర్యంలో అత్యాచార ఘటనపై నందిగామ గాంధీ సెంటర్లో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సిఐటియు ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కె.గోపాల్ మాట్లాడుతూ ట్రైనీ డాక్టర్ పై పాశవిక అత్యాచార ఘటన దేశాన్ని కలిచి వేసిందని నిందితులను కఠినంగా శిక్షించాలి చర్యలు తీసుకోవాలన్నారు. కలకత్తాలో ట్రైని డాక్టర్,విద్యార్థినిపై జరిగిన దాడిని తీవ్రంగా అదేవిధంగా రాష్ట్రంలో కూడా మహిళ మీద పని ప్రదేశంలో మహిళల మీద లైంగిక దాడులను తీవ్రంగా సిఐటియు ఖండిస్తుంది. మహిళలకు,డాక్టర్స్ కు పటిష్టమైన భద్రత కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించాలి అని డిమాండ్ చేశారు. ఈ ఘటన జరిగి వారం రోజుల నుండి దేశవ్యాప్తంగా ప్రజలు విద్యార్థులు ఆందోళన చేస్తున్న నేటి పాలకులకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గం అన్నారు.ప్రతి పది నిమిషాలకి మహిళపై దాడి జరుగుతుంది మహిళలకు రక్షణగా అనేక చట్టాలు తెస్తున్న,అమలుకు నోచుకోవట్లేదు అన్నారు.దేశంలో ఉన్న మెడికల్ కాలేజీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని మహిళలకు రక్షణ కల్పించే విధంగా సిబ్బంది నియమించాలన్నారు.కేంద్ర ప్రభుత్వం మెడికల్ కాలేజీలో సిబ్బంది నియమించకపోవడం ఇట్లాంటి ఘటనలు జరిగిందన్నారు.రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోతుందని బయటికి వెళ్లి ఇంటికి తిరిగి వచ్చేదాకా మహిళలకు ఏం జరుగుతుందోనన్న భయాందోళనలో ఈరోజు మహిళలు బ్రతకాల్సి వస్తుంది. విధులు నిర్వహించే మహిళల మీద లైంగిక దాడులు జరుగుతా ఉన్నాయి.వాళ్లకి పని ప్రదేశంలో భద్రత కల్పించాల్సింది అవసరం ప్రభుత్వం మీద ఉందని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జి గోపి నాయక్,అంగన్వాడి వర్కర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి కొల్లి సరళ, యామిని, పద్మజా, ఆశ వర్కర్ యూనియున్ ఆదిలక్ష్మి, నాగమణి, కవిత,పద్మ, మధ్యాహ్నం భోజనం యూనియన్ సుశీల, నాగేంద్రం, తదితరులు పాల్గొన్నారు.



## సీపీని కలిసిన కృష్ణమూర్తి నాయుడు



విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ : ఆంధ్రప్రదేశ్ రా ష్ట్రంలో అడిషనల్ ఎస్. పి.లు, ఎస్.పి.లు (నాన్ క్యాడర్)గా పదోన్నతి పొందా రు. వీరిలో ఎన్.టి.ఆర్.జిల్లా క్రైమ్ ఏ.డి.సి.పి.గా విధులు నిర్వహిస్తున్న ఎం.కృష్ణమూర్తి నాయుడు అడిషనల్ ఎస్.పి. నుండి ఎస్.పి.లు (నాన్ క్యాడర్) గా పదోన్నతి పొందినారు. ఈ నేపథ్యంలో ఈ రోజు పోలీస్ కమిషనర్ వారి కార్యాలయంలో పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబుని మర్యాదపూర్వకంగా కలిశారు.

## 21 జీవోను రద్దు చేయాలి



**విజయవాడ, మేజర్ న్యూస్ :** ఉచిత బస్సు ప్రయాణ పథకం వల్ల నష్టపోనున్న ఆటో, మోటారు రంగ కార్మికుల్ని ప్రభుత్వం ఆదుకోవాలని, 21 జీవో రద్దు చేయాలని, ఆటో మోటారు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌కి సచివాలయంలో ఐఎఫ్టీయూ నాయకులు బుధవారం వినతిపత్రం అందించారు. డీజిల్, సీయన్జీ ఆటోలను ప్రభుత్వం తీసుకుని సబ్సిడీలో ఎలక్ట్రిక్ వాహనాలను ఆటో కార్మికులందరికీ అందించాలని మంత్రిని నాయకులు కోరారు. సీయం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని మంత్రి సుభాష్ నాయకులకి హామీ ఇచ్చారు. ఐఎఫ్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.పోలారి, రాష్ట్ర నాయకులు ఎ.రవిచంద్ర, ఆటో నాయకులు ముని శంకర్, పి.రఫీఖాన్, పీడీఎస్ యూ నేత ఐ. రాజేష్ తదితరులు మంత్రిని కలిసినవారిలో ఉన్నారు.

## ఠాగూర్ గ్రంథాలయానికి పుస్తకాలు బహుకరణ



**విజయవాడ మేజర్ న్యూస్ :** బుధవారం ఉదయం ఠాగూర్ గ్రంథాలయానికి అన్నే శ్రీనాథ్ పాప కాలిఫోర్నియాలో ఎంఎస్ చేస్తున్న నీలాంజని, బాబు దిగ్విజయ్ వాళ్లు చిన్నప్పుడు చదువుకున్న స్టోరీ బుక్స్, ఇంగ్లీష్ నవలలు విలువైనవి, ఠాగూర్ గ్రంథాలయానికి బహుకరించారు. గ్రంథాలయా అధికారిణి రమాదేవి వారికి ధన్యవాదాలు తెలియజేసారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

17వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999